సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం ၊ 24 ၊ సెప్టెంబర్ ၊ 2024



టన్ను చీనీ రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు కనిష్టం రూ.10 వేలు, సరాసరిన రూ.13 వేల ప్రకారం ధర పలికాయి.



టమాట కిలో రూ.46
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.46 పలికింది. మార్కెట్‌కు 2,250 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.8°/22.7°
జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పురం' మార్కెట్‌లోనే పట్టుగూళ్లకు అధిక ధర

- కర్ణాటక మార్కెట్‌కు తరలిస్తే వ్యయప్రయాసలే
- తూకాల్లోనూ తేడాలుంటాయి జాగ్రత్త
- రైతులకు పట్టుగూళ్ల మార్కెట్ ఇన్‌స్పెక్టర్ సూచన



పట్టు గూళ్ల మార్కెట్

హిందూపురం అర్బన్: పట్టుగూళ్ల క్రయవిక్రయాలకు హిందూపురం మార్కెట్ ఆసియాలోనే పేరుగాంచిందని, మిగతా ప్రాంతాలతో పోలిస్తే నాణ్యమైన పట్టుగూళ్లకు ఇక్కడే అధిక ధర లభిస్తోందని పట్టుగూళ్ల మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు రైతులు కిలోపై రూ.20 ఎక్కువ పలుకుతున్నాయన్న ఆశతో కర్ణాటక రాష్ట్రంలోని రామనగర, శిడ్లగట్ట మార్కెట్‌లకు పట్టుగూళ్లు తరలిస్తున్నారని, దీనివల్ల వ్యయ ప్రయాసలే అధికమన్నారు. హిందూపురం మార్కెట్‌లో తూకాల్లోనూ ఎక్కడా మోసం ఉండదన్నారు. గత రెండేళ్లుగా కర్ణాటక మార్కెట్‌లతో పోలిస్తే ఇక్కడే అధిక ధర లభిస్తోందన్న విషయం రైతులు గమనించాలన్నారు. సోమవారం హిందూపురం మార్కెట్‌కు 62 మంది రైతులు 3,127 కిలోలు పట్టు గూళ్లు తెచ్చారని, కిలో బైవోల్టిన్ పట్టు గూళ్లు గరిష్టం రూ.680, కనిష్టంగా రూ.406, సగటున రూ.607 లెక్కన ధర పలికాయన్నారు.

పర్యాటక ప్రదేశాలపై ప్రచారం చేయాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



పర్యాటక దినోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని పర్యాటక ప్రదేశాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో పర్యాటక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాల విశిష్టను వివరిస్తూ బోర్డులు తయారు చేయాలని, వాటిని అన్ని పర్యాటక ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27న లేపాక్షి జటాయువు పార్కులో సాయంత్రం 5 గంటలకు జిల్లాలోని వివిధ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, తోలుబొమ్మలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన వాటిపై పోటీలు, ఎన్నికైన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇదేం బదిలీ ప్రక్రియ బాబోయ్!

- జెడ్పీలో గందరగోళం
- రాత్రి వరకూ పడిగాపులు కాసినా ప్రయోజనం శూన్యం

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. బదిలీల గడువు ఈ నెల 22తోనే ముగిసింది. కానీ, అందుకు భిన్నంగా 23వ తేదీ సోమవారం కూడా ప్రక్రియ చేపట్టినా, ఒక కొలిక్కి మాత్రం రాలేదు. కచ్చితంగా కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ ఉత్తర్వులు అందజేస్తారని ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగులు తరలివచ్చారు. అయితే, రాత్రి 10 గంటల వరకు ఎదురు చూసినా సమాధానం చెప్పే వారు కరువయ్యారు. కాగా, బదిలీల కోసం కొందరు ఉద్యోగులు ప్రజాప్రతినిధుల సిఫారసు లెటర్లు తీసుకురాగా, మరి కొందరు రూ. లక్షల్లో డబ్బు ముట్టచెప్పినట్లు తెలిసింది.

దరఖాస్తులిలా..
ఐదేళ్లు పూర్తి చేసుకొని బదిలీలకు అర్హత కలిగిన వారు 286 మంది ఉన్నారు. ఎంపీడీఓలు ఆరుగురు, 15 మంది ఏఓలు, 26 మంది సీనియర్ అసిస్టెంట్లు, 44 మంది జూనియర్ అసిస్టెంట్లు, 18 మంది టైపిస్టులు, 70 మంది రికార్డు అసిస్టెంట్లు, 20 మంది ల్యాబ్ అసిస్టెంట్లు, 84 మంది అటెండర్లు, ముగ్గురు నైట్ వాచ్‌మెన్లు ఉన్నారు. అన్ని రకాల బదిలీల కోసం మొత్తం 450 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 235 మంది, రిక్వెస్ట్ బదిలీల కోసం 215 మంది దరఖాస్తు చేసుకున్నారు.

కూటమి కిక్కు!

హిందూపురానికి చెందిన రమేష్ ప్రభుత్వ మద్యం దుకాణంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కోసం అప్పటికే పనిచేస్తున్న ప్రైవేటు ఉద్యోగాన్ని మానేశాడు. ప్రస్తుతం మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తాజాగా కూటమి సర్కార్ అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి అంతా 'ప్రైవేటు' పరం చేసేందుకు సిద్ధమైంది. ఈక్రమంలో రమేష్ పరిస్థితి గందరగోళంగా మారింది. తనపైనే ఆధారపడిన కుటుంబం, అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని తలచుకుని ఆందోళన చెందుతున్నాడు. ఉద్యోగం ఉంటుందో...లేదో తెలియక మానసిక వేదన అనుభవిస్తున్నాడు. జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది అందరిదీ ఇదే పరిస్థితి.

- అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ
- అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపై స్పష్టతనివ్వని సర్కార్
- మద్యం దుకాణాల్లోని ఉద్యోగులంతా ఇంటికేనా?
- ఇకపై మద్యం దుకాణాలన్నీ పచ్చ చొక్కాల చేతికి!



కదిరి: రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీని తీసుకొస్తోంది. ఇప్పటికే దీనిపై కేబినెట్ తీర్మానం కూడా చేసింది. దీంతో ఇన్నాళ్లు ప్రభుత్వ అధీనంలో నడిచిన మద్యం దుకాణాలు ఇకపై ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి వెళ్లనున్నాయి. వాటిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అక్టోబర్ 1వ తేదీ నుంచి ఇంటికే పరిమితం కావాల్సిన పరిస్థితి నెలకొంది. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో విధుల్లో చేరిన వీరందరినీ తొలగించాలని చంద్రబాబు సర్కారు నిర్ణయించినట్లు తెలుస్తోంది. మద్యం ధరలు తగ్గిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు మందు బాబులకు ఆనందం కలిగించినప్పటికీ.. తమ ఉద్యోగాల పరిస్థితి ఏమిటని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నార్థకంగా 300 మంది భవితవ్యం..
జిల్లాలో మొత్తం 65 మద్యం దుకాణాలున్నాయి. వీటిలో 65 మంది సూపర్‌వైజర్లు, 164 మంది సేల్స్‌మెన్లు, 65 మంది వాచ్‌మెన్లు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో దుకాణంలో ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్ పని చేస్తున్నారు. మండల కేంద్రాల్లోని మద్యం షాపుల్లో సూపర్‌వైజర్, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్ ఉన్నారు. వీరందరినీ గత జగన్ ప్రభుత్వం నియమించింది. ఐదేళ్లుగా వీరంతా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. సూపర్‌వైజర్‌కు రూ.19 వేలు, సేల్స్‌మెన్‌కు రూ.16,500, వాచ్‌మెన్‌కు రూ.12 వేల చొప్పున ఇప్పటివరకూ వేతనం ఇచ్చారు.

దోపిడీ..కల్తీమద్యం అరికట్టేందుకే..
వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడక మునుపు 2014 నుంచి 2019 వరకూ రెండేళ్లకోసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచేవారు. లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించేవారు. కొన్నింటికి డిమాండ్ ఉండేది. మరికొన్నింటికి అంత డిమాండ్ ఉండేది కాదు. మహిళలు సైతం ఈ టెండర్లలో పాల్గొనేవారు. పేరుకు లాటరీ పద్ధతే అయినప్పటికీ మద్యం వ్యాపారమంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే నడిచేది. దీంతో కొందరు కల్తీ మద్యంతో పాటు అధిక ధరలకు మద్యం విక్రయించేవారు. దీనికి స్వస్తి పలుకుతూ జగన్ ప్రభుత్వం మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే నడిచే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ఎక్కడా కల్తీ మద్యం గానీ, అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారనే ఫిర్యాదులు, ఆరోపణలు రాలేదు. మద్యం దుకాణాల ద్వారా ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. ఆ వచ్చిన జీతంతో వారంతా సంతోషంగా ఉన్నారు.

దుకాణాలన్నీ తమ్ముళ్ల చేతికే..
కూటమి ప్రభుత్వం అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీని తీసుకొస్తున్న కారణంగా మద్యం దుకాణాలన్నీ తెలుగు తమ్ముళ్ల చేతికే దక్కేలా ప్లాన్ చేశారు. మద్యం దుకాణాలు తమకే దక్కాలని జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మద్యం వ్యాపారాల్లో ఆరితేరిన టీడీపీ నేతలు కొందరు ఇప్పటికే ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల ఆశీర్వాదాలు తీసుకున్నారు. కొందరైతే ప్రతి నెలా కొంత మొత్తం ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఇచ్చే విధంగా ఒప్పందాలు కూడా చేసుకున్నారని ఆ పార్టీ వర్గీయులే చెబుతున్నారు. లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, లాటరీలో ఎవరికి దుకాణం దక్కినా వారిని భయపెట్టి బలవంతంగా లాక్కోవాలని కొన్ని చోట్ల ఇప్పటికే వ్యూహం రచించారు. ఇంకొన్ని చోట్ల కల్తీ మద్యం తయారీకి అప్పుడే ఫామ్‌హౌస్‌లు కూడా సిద్ధం చేసుకున్నారు. కొత్త మద్యం పాలసీ విధానంతో అందులో పని చేసే అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని కొనసాగిస్తారా? లేదంటే తొలగిస్తారా? అనే దానిపై ప్రభుత్వం ఇంత వరకూ ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. మద్యం కొత్త పాలసీకి తాము వ్యతిరేకం కాదని, తమనే కొనసాగించాలని వారు కోరుతున్నారు.



జిల్లాలో మద్యం దుకాణాల వివరాలు	
మద్యం దుకాణాలు	65
సూపర్‌వైజర్లు	65
సేల్స్‌మెన్‌లు	164
వాచ్‌మెన్‌లు	65
బార్లు	11

ఐదేళ్లుగా పని చేస్తున్నాం



ఐదేళ్లుగా మద్యం దుకాణాల్లో పని చేస్తున్నాం. మేము ఎవరికీ వ్యతిరేకం కాదు. కొత్త మద్యం పాలసీని కూడా స్వాగతిస్తున్నాం. అయితే మద్యం దుకాణాల్లో పని చేసేందుకు మాకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం. ఉన్న ఫలంగా మమ్మల్ని తొలగిస్తే రోడ్డున పడతాం. కూటమి ప్రభుత్వం మా పట్ల సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం.
– అక్బర్‌బాషా, వైన్‌షాప్ సూపర్‌వైజర్, నల్లచెరువు

మమ్మల్నే కొనసాగించాలి



కూటమి ప్రభుత్వం మద్యం కొత్త పాలసీని తీసుకొస్తే ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే వైన్‌షాప్‌లలో మమ్మల్నే కొనసాగించాలని కోరుతున్నాం. ఐదేళ్లుగా మాపై ఎలాంటి ఆరోపణలు రాకుండా పనిచేశాం. భవిష్యత్‌లో కూడా అలాగే పని చేస్తాం. మమ్మల్ని కొనసాగించే విషయమై ప్రభుత్వం స్పష్టత నివ్వాలి. లేకపోతే మా కుటుంబాలు రోడ్డున పడతాయి.
–ఎం.శ్రీనివాసులు, వైన్‌షాప్ సేల్స్‌మెన్, తలుపుల

ఆదేశాలు ఇంకా రాలేదు

మద్యం దుకాణాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించాలని గానీ, కొనసాగించమని గానీ ఉత్తర్వులు రాలేదు. అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం కొత్త పాలసీ అమలులోకి రానుంది. లాటరీ పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయిస్తారు. మద్యం దుకాణాల కేటాయింపునకు త్వరలోనే దరఖాస్తులను స్వీకరిస్తారు. అంతా పారదర్శకంగా జరుగుతుంది.
– వాసుదేవ, జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

మరణిస్తూ మంచిపని!

- దేహాన్ని దానం చేసిన వ్యవసాయ శాస్త్రవేత్త నరసింహారెడ్డి
- ఉద్యోగ జీవితంలో నూతన వంగడాలతో రైతులకు మేలు
- మరణానంతరం వైద్యవిద్యార్థులకు మేలు జరిగేలా నిర్ణయం



నరసింహారెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్: ఆయనో వ్యవసాయ శాస్త్రవేత్త. ఉద్యోగంలో ఉన్నన్ని రోజులూ నూతన వంగడాలు కనిపెడుతూ రైతుకు, సమాజానికి ఎంతో ఉపయోగపడ్డారు. పదవీ విరమణ తర్వాత కూడా నిత్యం సమాజం గురించే ఆలోచించేవారు. చివరకు తన ప్రాణం పోయినా ఎందరో మెడికల్ విద్యార్థులకు మేలు జరిగేలా తన దేహాన్ని దానం చేశారు. ఆయనే కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా పని చేసిన డాక్టర్ పూడూరు నరసింహారెడ్డి(86). వయస్సు మీద పడటంతో సోమవారం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో నరసింహారెడ్డి మృతిచెందారు. అయితే ఆయన బతికి ఉన్నప్పుడే మరణానంతరం తన శరీరాన్ని దానం చేయాలని కుటుంబీకులకు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన మృతదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనార్థం కడప రిమ్స్ ఆస్పత్రికి అప్పగించారు. ఇందుకు ఆయన భార్య లీలావతి కూడా పూర్తిగా అనుమతించారు.

విత్తన వేరుశనగ రకాల సృష్టికర్త..
నరసింహారెడ్డి 1987లో కదిరి అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో బ్రీడర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1995లో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పదోన్నతి పొందారు. ఆయన ఆధ్వర్యంలో 1993లో జేఎల్24 రకాలను సంకరపరచి 'వేమన' అనే కొత్త రకం వంగడాన్ని ఉత్పత్తి చేశారు. అలాగే కదిరి–4 అనే రకం విత్తన వేరుశనగను కూడా అభివృద్ధి చేశారు. ఈ రెండు వంగడాలు రైతులకు లాభసాటిగా మారాయి.

నవోదయ దరఖాస్తుకు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబర్ 7వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయొద్దు

- అర్జీలన్నీ నకాలంలో పరిష్కరించండి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం




'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పాల్గొని వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ''ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో జిల్లా కేంద్రం వరకూ వచ్చి తమ సమస్యలపై అర్జీలిస్తారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకండి. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలన్నింటికీ సకాలంలో పరిష్కారం చూపండి'' అని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 309 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. ఎక్కువగా పింఛన్ మంజూరు, భూసమస్యలు, ఇంటి పట్టాలు, ఇల్లు మంజూరు కోరుతూ ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ చేతన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఒక సమస్యపై ఒక్కసారి అర్జీ ఇచ్చిన అర్జీదారుడు తిరిగి మళ్లీ అర్జీ ఇవ్వకుండా సమస్యను పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో కౌంటర్ ఫైల్, అప్పీలు దాఖలు చేయాలన్నారు. సిబ్బంది కారణంగా ఏవైనా తప్పులు జరిగితే క్షమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అందిన అర్జీల్లో కొన్ని...
- పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు రామ్మోహన్ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే రోడ్డు వేయించాలని అర్జీ సమర్పించారు.
- తాము అర్హులమైనప్పటికీ రాజకీయ కక్షతో తమ పింఛన్లు నిలిపివేశారని రామగిరి మండల పరిధిలోని కొండాపురం, నరసనకోట పంచాయతీ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాలకు చెందిన ఓబులేసు, శ్రీనివాసులు, నరేంద్ర, కొండన్న, గంగన్న, వెంకటేశులు, భగవంతప్ప, పూజారప్ప, ముత్యాలుతోపాటు 15 మంది ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే తమ పింఛన్లు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు అవగాహన సదస్సులు
- విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ రత్న పేర్కొన్నారు. సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో విలేకరులతో మాట్లాడారు. జిల్లా సరిహద్దులోని పోలీసు స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు, గంజాయి, గ్యాంబ్లింగ్, మద్యం అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపుతామన్నారు. సైబర్ నేరాలపై ఇప్పటికే ధర్మవరం, హిందూపురం తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అలాగే ధర్మవరం, అమడుగూరు, నల్లమాడ, గోరంట్ల ప్రాంతాల్లో దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పోలీసులు ప్రజల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పాటు చేసి నేర నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. నేర సమీక్షా సమావేశాలు ఒక్కచోట కాకుండా రెండు, మూడు ప్రాంతాల్లో నిర్వహించి కేసులు తగ్గించే ప్రయత్నం చేస్తామన్నారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, స్టేషన్లు లేకపోయినా సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్ నియంత్రణ చేపడతామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పాటు సిబ్బంది పాల్గొన్నారు



న్యాయం గెలిచింది

- కందుకూరు శివారెడ్డి హత్యకేసులో తీర్పు వెలువరించిన న్యాయస్థానం
- ముద్దాయిలకు రెండు జీవిత కాలాల కఠిన కారాగార శిక్ష
- హర్షం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న పోలీసులు



హత్యకు గురైన శివారెడ్డి (ఫైల్)

రాప్తాడురూరల్: ఎంతో చైతన్యం కల్గిన గ్రామం. పండుగలు, ఏవైనా శుభకార్యాలు జరిగితే రాజకీయ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా గ్రామస్తులంతా కుటుంబ సభ్యుల్లా కలసిపోయేవారు.సంతోషంగా వేడుకలు జరుపుకునేవారు. ఇంతటి ప్రశాంతమైన గ్రామంలో ఆరేళ్ల క్రితం కలకలం రేగింది. కొంతమంది రాజకీయ శక్తులు తమ స్వార్థం కోసం జరిపిన హత్యోదంతంతో ఒక్కసారిగా గ్రామస్తులంతా శోకంలో మునిగిపోయారు. తమ అప్తుడు, ఎంతో సౌమ్యుడైన వ్యక్తిని చంపారన్న వార్తను తట్టుకోలేకపోయారు. మానవత్వం మరిచి, కర్కశంగా ప్రవర్తించిన హంతకులకు తాజాగా శిక్ష పడడంతో వారంతా ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామంలో 2018లో వైఎస్సార్ సీపీ నేత శివారెడ్డి హత్య కలకలం రేపింది. శివారెడ్డి హత్యతో ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోగా.. గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. గ్రామానికి సంబంధం లేని వ్యక్తులు ఆధిపత్యం కోసం సౌమ్యుడు, వివాదరహితుడిని హత్య చేయడాన్ని ముక్తకంఠంతో ఖండించారు.

ముద్దాయిలకు శిక్షతో హర్షాతిరేకాలు
శివారెడ్డి హత్యపై పోలీసులు కేసు నమోదు చేయగా.. జిల్లా కోర్టులో విచారణ నడిచింది. అభియోగాలు రుజువు కావడంతో సాకే బాలకృష్ణ (ఏ1), సాకే రమేష్ (ఏ3), సాకే అశోక్(ఏ4), సాకే భాస్కర్ (ఏ5), సాకే విజయ్‌కుమార్ (ఏ6), తలారి సూర్యనారాయణ (ఏ8), తలుపూరి మహేంద్ర (ఏ9)లకు రెండు జీవిత కాలాల కఠిన కారాగార శిక్ష (ఏకకాలంలో అమలు) విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ సంచలన తీర్పు వెలువరించారు. వీరిలో సాకే భాస్కర్, సాకే విజయ్‌కుమార్‌లకు రూ.35 వేల చొప్పున, మిగిలిన ఐదుగురికి రూ.30 వేల చొప్పున జరిమానా విధించారు. ఇద్దరు మైనర్లపై జువైనల్ కోర్టులో కేసు నడుస్తోంది. శివారెడ్డి కేసులో సోమవారం తీర్పు వెలువడుతుందనే సమాచారం తెలియడంతో కందుకూరులో ఉదయం నుంచి ఉత్కంఠ నెలకొంది. కేసులో ముద్దాయిలకు శిక్ష విధించారని తెలియగానే గ్రామస్తులంతా 'న్యాయం గెలిచింది' అంటూ సంతోషం వ్యక్తం చేశారు.

చట్టానికి ఎవరూ అతీతులు కారు



కందుకూరు శివారెడ్డి హత్య కేసులో న్యాయం జరిగింది. చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఈ కేసుతో మరోసారి నిరూపితమైంది. హంతకుల తరఫున తీవ్రస్థాయిలో బెదిరింపులు వచ్చినా శివారెడ్డి కుటుంబం భయపడకుండా గట్టిగా నిలబడింది. పరిటాల సునీత మంత్రిగా ఉన్న సమయంలో ఈ హత్య జరిగింది. నిందితులకు పరిటాల సునీత గ్రామమైన వెంకటాపురంలో ఆశ్రయం ఇచ్చారు. ఈ కేసులో దోషులను తప్పించే ప్రయత్నం చేశారు. శివారెడ్డి హత్య జరిగిన రోజు మార్చురీ వద్ద నేను ధర్నా చేస్తే నాపై కేసు నమోదు చేశారు. పరిటాల రవీంద్ర హత్య కేసులో ఆ కుటుంబం పోరాడి న్యాయం పొందింది. ఆ తర్వాత జరిగిన హత్యల్లో హంతకుల పక్షాన నిలబడడం బాధాకరం. వారిలోనూ మార్పు రావాలి. బాధితులు భయపడకుండా పోరాడితే కచ్చితంగా న్యాయం జరుగుతుందనేందుకు ఈ కేసు ఒక ఉదాహరణ.
– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

తోపుదుర్తి కుటుంబం అండగా నిలిచింది



నా సోదరుడి హత్య కేసులో హంతకులకు శిక్ష పడాలనే మా పోరాటానికి తోపుదుర్తి కుటుంబం పూర్తిగా అండగా నిలిచింది. న్యాయం గెలుస్తుంది.. ధైర్యంగా ఉండాలంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చందు, రాజశేఖర్‌రెడ్డి పదేపదే చెప్పారు. దీనికితోడు పోలీసు, న్యాయ వ్యవస్థ బాగా సహకరించాయి. ముద్దాయిలు చాలా కేసుల్లో నిందితులు. రాజీ కాకపోతే మమ్మల్ని చంపుతామంటూ బెదిరింపులు వచ్చాయి. డిపార్ట్‌మెంట్ అండగా నిలబడింది. సమాజానికి చీడపురుగుల్లాంటి వారికి శిక్ష పడాలని మేము చేసిన పోరాటం ఫలించింది. జువైనల్ కోర్టులోనూ ఇద్దరు నిందితులకు శిక్ష పడాలి.
– నరసింహారెడ్డి, శివారెడ్డి సోదరుడు

నా భర్త ఆత్మకు శాంతి చేకూరింది



అకారణంగా నా భర్తను పొట్టన పెట్టుకున్నారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేందుకు మనోధైర్యంతో ముందుకెళ్లాం. న్యాయం గెలిచింది. ముద్దాయిలకు శిక్ష పడడంతో మా ఆయన ఆత్మకు ఈరోజు శాంతి కలిగింది.
– సువర్ణమ్మ, శివారెడ్డి భార్య

నా కళ్ల ముందే హత్య చేశారు..



క్రూర మనస్తత్వం కల్గిన వారు సమాజంలో ఉంటే చాలా ప్రమాదకరం. నాలాగా తండ్రిని కోల్పోయి మరొకరు ఇబ్బంది పడకూడదు. అందుకోసమే హంతకులకు శిక్ష పడాలని గట్టిగా నిలబడ్డాం. ఆ రోజు నా కళ్లముందే నాతండ్రిని హత్య చేశారు. ఈ కేసులో మాకు తోపుదుర్తి కుటుంబం అండగా నిలిచి ధైర్యం నింపింది. – భానుప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి కుమారుడు

క్లుప్తంగా

వివాహిత దుర్మరణం


మృతురాలు వేదవతి

గోరంట్ల: ప్రమాదవశాత్తు లారీ కిందపడి ఓ వివాహిత దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్లకు చెందిన వేదవతి (45), మల్లికార్జున దంపతులు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బస్టాండ్ వైపు నుంచి ఇంటికి బయలుదేరారు. కమ్మవారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇద్దరూ కిందపడ్డారు. లారీ వెనుక చక్రాల కిందపడిన వేదవతి అక్కడికక్కడే మృతి చెందింది. మల్లికార్జున సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేదపండితుల నిరుద్యోగ భృతికి దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: వేద పండితులకు నిరుద్యోగ భృతి అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారి నరసింహరాజు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగ వేదపండితులకు ప్రతి నెలా రూ.3వేలు చొప్పున భృతి అందజేస్తారు. క్రమాంతం ఆపై కోర్సు పూర్తి చేసిన వారు సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్ కాపీలతో పాటు, తాము ఏ ఉద్యోగమూ చేయడం లేదని స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని జతపరిచి జిల్లా ఎండోమెంట్ అధికారి కార్యాలయంలో ఈ నెల 26వ తేదీలోపు అందజేయాలి.


మకరందాన్ని ఆస్వాదిస్తున్న తూనీగ


కత్తెర పురుగుపై దాడి చేస్తున్న దృశ్యం

తూనీగ.. తూనీగ..

ప్రకృతి ప్రసాదించిన అందమైన జీవరాసుల్లో ఒక్కటైన తూనీగలు పుట్టపర్తి పరిసరాల్లో కనువిందు చేస్తున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా తూనీగల సంచారం మొదలైంది. ఎక్కువగా వరి మడుల ప్రాంతంలో సంచరిస్తూ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా దోమలు, ఆకులను కత్తిరించే ఈగలు వంటి వాటిని ఆహారంగా తీసుకునే తూనీగలు... పంటల సాగులో అన్నదాతలకు ఎంతో సహాయకారిగా ఉంటాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఒక తూనీగ రోజుకు 30 నుంచి వందల కొద్ది దోమలను, ఈగలను తినేస్తుందంటున్నారు.

– పుట్టపర్తి రూరల్:




వరి పంటలో దోమలపై దాడి చేస్తూ..


చిగురుకొమ్మపై సేద తీరుతూ...


ఆకుపై ఇలా...

డబ్బు అడిగితే చంపేస్తామంటున్నారు

- రామ్‌లక్ష్మణ్ దౌర్జన్యంపై ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

పుట్టపర్తి టౌన్: 'ఇక్కడ మాకు ఎదురు లేదు. మరోసారి డబ్బు తిరిగిమ్మంటే చంపేస్తాం' అంటూ పుట్టపర్తికి చెందిన రామ, లక్ష్మణ్ సోదరులు బెదిరిస్తున్నారని ఎస్పీ రత్న ఎదుట కదిరికి చెందిన మల్లికార్జున వాపోయాడు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీకి వినతి పత్రం అందజేసి, మాట్లాడాడు. వివరాలు... బీడుపల్లి లేఅవుట్‌లో 3 సెంట్ల స్థలం ఇస్తామంటూ మల్లికార్జున నుంచి రూ.8 లక్షలను 2022, ఏప్రిల్‌లో మధ్యవర్తి సతీష్‌కుమార్ ద్వారా రామ, లక్ష్మణ్ తీసుకున్నారు. ఈ క్రమంలో స్థలం ఇవ్వకపోగా... డబ్బు చెల్లింపులకూ ఇబ్బంది పెడుతూ వచ్చారు. నెలలు గడుస్తున్నా రామ్‌లక్ష్మణ్ సోదరులు మొండి వైఖరి అవలంబిస్తుండడంతో మల్లికార్జున నేరుగా వెళ్లి నిలదీశాడు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ డబ్బు తిరిగి ఇచ్చేది లేదని, పదేపదే అడిగితే చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో బాధితుడు నేరుగా ఎస్పీ రత్నను కలసి తన గోడు వెల్లబోసుకోవడంతో సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని స్థానిక అర్బన్ సర్కిల్ కార్యాలయానికి ఆమె సిఫారసు చేశారు. కాగా, ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 76 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా బాధితుల నుంచి వినతులు స్వీకరించి, మాట్లాడారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... గ్రీవెన్స్‌లో అందిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, నిర్ణీత సమయంలోపు వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీ విజయకుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీరత్న

పోలీసుల అదుపులో అనుమానితుడు

పెనుకొండ: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న యువకుడిని స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. సెల్‌ఫోన్ చోరీ చేసినట్లుగా అనుమానాలు వ్యక్తం కావడంతో పారిపోతున్న యువకుడిని స్థానికులు వెంటాడి పట్టుకుని దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజేష్ అక్కడకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వాస్తవాలు తెలుసుకోకుండా దాడి చేయడం సబబు కాదని స్థానికులకు హితవు పలికారు. యువకుడిని పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు.


యువకుడిని స్టేషన్‌కు తీసుకువెళుతున్న పోలీసులు

భారీగా ఎంపీడీఓల బదిలీలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకేసారి 40 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అనుమతితో ఈ బదిలీలు పూర్తి చేశారు. ఎంపీడీఓల బదిలీల జాబితాను జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ సోమవారం రాత్రి విడుదల చేశారు. బీకేఎస్‌లో పనిచేస్తున్న కె.తేజోష్నను పామిడికి, అక్కడ పనిచేస్తున్న డి.ప్రభాకర్‌ను గుత్తికి బదిలీ చేశారు. రాప్తాడులో పనిచేస్తున్న జె.స్మాలన్‌ను బీకేఎస్‌కు కేటాయించారు. కదిరి రూరల్ నుంచి జి.శ్రీకాంత్ చౌదరిని గుంతకల్లు రూరల్‌కు, బెళుగుప్ప నుంచి జి.ఎస్.రామచంద్రను కళ్యాణదుర్గం రూరల్‌కు, పెద్దపప్పూరు నుంచి బి.రామకృష్ణను శెట్టూరుకు, నార్పలలో పని చేస్తున్న పి.దివాకర్‌ను అనంతపురం రూరల్‌కు, కుందుర్పి నుంచి జి.లక్ష్మీనరసింహను ఆత్మకూరుకు బదిలీ చేశారు. తాడిపత్రి రూరల్ నుంచి ఎ.వి.రంగారావును తాడిమర్రికి, అక్కడి నుంచి బి.విజయలక్ష్మిని రాప్తాడుకు, నల్లమాడ నుంచి ఎం.కొండన్నను రాయదుర్గానికి, కనగానపల్లి నుంచి టి.అలివేలమ్మను పుట్లూరుకు, అక్కడి నుంచి టి.యోగానందరెడ్డిని గార్లదిన్నెకు, ధర్మవరం రూరల్ నుంచి పి.సౌజన్యను యల్లనూరుకు, అక్కడ పనిచేస్తున్న వీర్రాజును యాడికికి, అక్కడ పనిచేస్తున్న టి.లక్ష్మీనారాయణను బెళుగుప్పకు, కొత్తచెరువు నుంచి బారాన్‌సాహెబ్‌ను పెద్దవడుగూరుకు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న పి.కుళ్లాయిస్వామిని కూడేరుకు, అగళి నుంచి బి.వి.రవిప్రసాద్‌ను ఉరవకొండకు, బొమ్మనహాళ్ నుంచి ఎస్.షకీలా బేగంను విడపనకల్లుకు, అక్కడ పనిచేస్తున్న ఎ.వి.శ్రీనివాసులును బుక్కపట్నానికి, లేపాక్షి నుంచి ఎం.నరసింహనాయుడును బత్తలపల్లికి, అక్కడ పనిచేస్తున్న ఎస్.సాయి మనోహర్‌ను ధర్మవరానికి, గార్లదిన్నె నుంచి డి.విజయభాస్కర్‌ను ముదిగుబ్బకు, అక్కడ పనిచేస్తున్న కె.వి.కవిరాజును రొళ్లకు, గోరంట్ల నుంచి ఎస్.రఘునాథగుప్తను నల్లచెరువుకు, అక్కడ పనిచేస్తున్న వి.శకుంతలను పెద్దపప్పూరుకు, పెనుకొండ నుంచి ఎస్.శివశంకరప్పను చెన్నేకొత్తపల్లికి, అక్కడ పనిచేస్తున్న ఎస్.గంగావతిని నార్పలకు బదిలీ చేశారు. గుమ్మఘట్ట నుంచి ఎస్.నరసింహమూర్తికి లేపాక్షి, గుడిబండ నుంచి డి.రామారావుకు అమరాపురం, హిందూపురం రూరల్ నుంచి పి.నరేంద్రకుమార్‌కు గోరంట్ల, పరిగిలో పనిచేస్తున్న వి.సరస్వతికి సోమందేపల్లి, రొద్దం నుంచి రాబర్ట్ విల్సన్‌కు ఓడీసీ, రొళ్ల నుంచి ఆజాద్‌కు రామగిరికి, బ్రహ్మసముద్రంలో పనిచేస్తున్న దాసానాయక్‌కు డి.హీరేహాళ్ కేటాయించారు. ఇక అంతర్ జిల్లా నుంచి అగళికి ఎస్.యాదవేంద్ర, కదిరి రూరల్‌కు పి.పోలప్పల్, గాండ్లపెంటకు బి.వెంకట్రామిరెడ్డి బదిలీపై రానున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

హిందూపురం అర్బన్: రైళ్లలో ప్రయాణిసూత ప్రయాణికుల నుంచి విలువైన సామగ్రి, నగలు అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను సోమవారం హిందూపురం రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను జీఆర్పీ సీఐ అశోక్‌కుమార్ వెల్లడించారు. సోమవారం ఉదయం హిందూపురం రైల్వే స్టేషన్ 1వ ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆర్‌పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో వారు రైలు ప్రయాణికులవిలువైన సామగ్రి అపహించుకెళ్లేవారిగా నిర్ధారణ అయింది. పట్టుబడిన వారిని ఉత్తర్‌ప్రదేశ్‌లోని దొండి జిల్లా టిండవ గ్రామానికి చెందిన రామ్‌కరణ్, మనోజ్‌కుమార్, హకీవుల్లాగా గుర్తించారు. వీరు బెంగళూరులోని బనశంకరి ప్రాంతంలో ఉంటూ తరచూ రైళ్లలో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికులను మచ్చిక చేసుకొని కూల్‌డ్రింక్స్, ఇతర వాటిల్లో మత్తుమందు ఇచ్చి నగదు, బంగారం, వెండి, లాప్‌ట్యాప్‌లు అపహరించుకెళ్లేవారు. ప్రధానంగా మైసూర్ ఎక్స్‌ప్రెస్, కర్ణాటక ఎక్స్‌ప్రెస్‌లలోనే వీరు ఎక్కువగా చోరీలకు పాల్పడ్డారు. చోరీ చేసిన సొత్తును ఉత్తరప్రదేశ్‌లోని లూధియానాకు చెందిన మనోజ్‌సింగ్‌కు అప్పగించేవారు. త్వరలో మనోజ్‌సింగ్‌నూ అరెస్ట్ చేయనున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. కాగా, అనంతపురం, హిందూపురం, విజయవాడ, బెంగళూరు రైల్వే స్టేషన్లలో జరిగిన ఆరు చోరీ కేసుల్లో ప్రస్తుతం పట్టుబడిన వారు ప్రధాన నిందితులుగా నిర్ధారణ కావడంతో వారి నుంచి రూ.3.50 లక్షల విలువ చేసే బంగారం, రెండు ల్యాప్‌ట్యాప్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లు, 895 నిద్ర మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఉట్టిపడిన శ్రీకాకుళం సంస్కృతి


శ్రీకృష్ణ లీలల నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు


సాంస్కృతిక కార్యక్రమంతో ఆకట్టుకుంటున్న శ్రీకాకుళం భక్తులు

పుట్టపర్తి రూరల్: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న శ్రీకాకుళం వాసులు తమ ప్రాంత సంస్కృతిని ప్రతిబింబిస్తూ సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు దంపతులు పూజలు నిర్వహించి, నగర సంకీర్తనను ప్రారంభించారు. కార్యక్రమంలో దాదాపు 2 వేల మంది శ్రీకాకుళం సాయి భక్తులు పాల్గొన్నారు.

జూడో ఓవరాల్ చాంపియన్ 'అనంత'

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహించిన ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్ర స్థాయి అండర్–14 బాలబాలికల జూడో పోటీలు సోమవారంతో ముగిశాయి. క్రీడాకారుల బరువు ఆధారంగా ఏడు కేటగిరీల్లో పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను అనంతపురం జిల్లా బాలబాలికలు దక్కించుకున్నారు. బాలుర విభాగంలో కర్నూలు జిల్లా, గుంటూరు జిల్లా, బాలికల విభాగంలో చిత్తూరు, నెల్లూరు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఆయా జట్లకు ఎస్‌జీఎఫ్ తిరుపతి జిల్లా కార్యదర్శి ఎస్.బాబు, డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్ పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. కాగా, జాతీయ స్థాయి పోటీలకు అనంతపురానికి చెందిన క్రీడాకారులు టి.జయసింహ, ఎస్.దర్శన్ తేజ, డి.యశ్వంత్, ఎం.విక్రాంత్, ఎస్‌ఏ.మీరజ్, ఎ.అక్షయేణి, ఎస్.మీరా జాస్మిన్, బి.నాగశ్వేత, బి.ప్రవల్లిక, బి.కావ్య ఎంపికయ్యారు.

రూ.9 లక్షల విలువైన టపాసుల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న టపాసులు చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.9 లక్షల విలువైన టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు సోమవారం ఉదయం ఎస్‌ఐ రమేష్‌బాబు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పాతూరు, పెద్దమ్మ ఆలయం సమీపంలోని ఇళ్లలో టపాసులు నిల్వలు గుర్తించి సీజ్ చేశారు. టపాసులను అక్రమంగా నిల్వ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

- పరిగి: స్థానిక టపాసుల విక్రేత శివకుమార్ ఇంట్లో నిల్వ ఉంచిన రూ.3 లక్షల విలువైన టపాసులను పోలీసులు సీజ్ చేశారు. గత ఏడాది దీపావళి సందర్భంగా టపాసుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆయన అమ్ముడు పోగా మిగిలిన టపాసులను తన ఇంట్లోనే ఓ గదిలో నిల్వ చేశాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎస్‌ఐ రంగడు... సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టి టపాసులను సీజ్ చేసి, ఊటుకురు వద్ద ఉన్న గోదాముకు తరలించారు. అలాగే పెద్దిరెడ్డిపల్లిలో సోమవారం చేపట్టిన తనిఖీల్లో 96 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నంజుండప్పపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.
- చిలమత్తూరు: స్థానిక టీడీపీ నేత, మాజీ సర్పంచ్ అశ్వత్థప్ప సోదరుడు మోహన్ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన టపాసులను పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం తనిఖీలు చేపట్టడంతో 23 బాక్సుల్లో దాచిన టపాసులు గుర్తించి సీజ్ చేశామన్నారు. ఎమ్మార్పీ మేరకు వీటి విలువ రూ.2.50 లక్షలని పేర్కొన్నారు.
- హిందూపురం అర్బన్: స్థానిక నింకంపల్లి రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు దొంగ చాటుగా అమ్మకం చేస్తున్న నాగరాజును పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.40 వేలు విలువ చేసే టపాసులు సీజ్ చేశారు.

దంపతుల్ని చిదిమేసిన ఐషర్


హనుమంతరెడ్డి, రంగమ్మ (ఫైల్)



సర్వజనాస్పత్రిలో రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

- అదుపుతప్పి బైకుపై బోల్తా పడ్డ టమాట వాహనం
- ఘటనాస్థలిలోనే దంపతుల దుర్మరణం

అనంతపురం: రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం పాలైన ఘటన నగర శివారు ప్రాంతం నేషనల్ పార్కు సమీపంలో జరిగింది. వివరాలు.. గుత్తి మండలం అబ్బేదొడ్డికి చెందిన కమతం హనుమంతరెడ్డి (72), కమతం రంగమ్మ (68) దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు జయలక్ష్మి , కాంతమ్మ, కృష్ణకుమారి, ఒక కుమారుడు నాగేశ్వర రెడ్డి సంతానం. అందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. నాగేశ్వర రెడ్డి సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. అనంతపురంలోని చిన్మయనగర్‌లో నివాసముండే కుమార్తెలను చూసేందుకు ప్రతి వారం హనుమంతరెడ్డి, రంగమ్మ వచ్చి వెళ్లేవారు. ఈ క్రమంలోనే సోమవారం వచ్చి తిరిగి స్వగ్రామం బయలుదేరారు. నేషనల్ పార్కు వద్ద వెళ్తున్న సమయంలో ఓ ఐషర్ వాహనం అదుపుతప్పి బైకుపై పడిపోయింది. దంపతులిద్దరూ ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. ప్రమాద ధాటికి హనుమంతరెడ్డి తల తెగిపోయింది. కక్కలపల్లి మండీలో టమాట బాక్సులు లోడు చేసుకున్న ఐషర్ డ్రైవర్ ముంబైకు వెళ్తున్నట్లు తెలిసింది. నేషనల్ పార్కు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద వేగం అదుపు కాకపోవడంతో బోల్తా కొట్టి పక్కనే బైక్‌పై వెళ్తున్న హనుమంతరెడ్డి, రంగమ్మపై పడినట్లు విచారణలో వెల్లడైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను సర్వజనాస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదం గురించి తెలుసుకున్న మృతుల కుటుంబీకులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు.


సంఘటనా స్థలంలో గుమిగూడిన ప్రజలు

విహారయాత్రలో విషాదం


నరసింహారెడ్డి (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక శారదానగర్‌లో నివాముంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి (62) విహారయాత్రలో చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నార్పల మండలం బి.బండ్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సోషల్ టీచర్‌గా పని చేస్తూ గత ఆగస్టు 31న ఆయన ఉద్యోగ విరమణ పొందారు. మూడు రోజుల క్రితం పది మంది స్నేహితులతో కలసి రెండు వాహనాల్లో గోవా యాత్రకు వెళ్లారు. కర్ణాటకలోని హొస్పేట సమీపంలో ఓ వాహనం అదుపు తప్పి బోల్తాపడడంతో క్షతగాత్రులను హొస్పేటలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం నరసింహారెడ్డిని ఆదివారం అర్ధరాత్రి అనంతపురంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందారు.

కేతిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే అనంత పరామర్శ


కేతిరెడ్డిని పరామర్శిస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి

ధర్మవరం రూరల్: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. సోమవారం ధర్మవరంలోని సబ్ జైలులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శించేందుకు వెళ్లిన కేతిరెడ్డిని కూటమి నేతలు అడ్డుకున్నారు. అదే సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. విషయం తెలియగానే అనంత వెంకటరామిరెడ్డి ధర్మవరానికి చేరుకుని కేతిరెడ్డిని కలిసి ఘటనపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి సర్కార్ విఫలమైందని మండిపడ్డారు. దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్‌టీఐపై బదిలీ వేటు


పెద్దన్న

పుట్టపర్తి టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న పెద్దన్నపై బదిలీ వేటు పడింది. కదిరి ఎస్‌టీఐగా బదిలీ చేస్తూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, ఆయన పనితీరు సక్రమంగా లేదని ఎస్‌ఎంయూ నాయకులు, కార్మికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ముదిగుబ్బ: పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీఎస్ పాళ్యం సమీపంలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ శ్యామరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం టీఎస్‌పాళ్యం పరిసరాల్లో పట్నం ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.70,600 నగదు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

బాలుడి అదృశ్యం


చీమల తరుణ్

తాడిమర్రి: మండలంలోని మర్రిమాకులపల్లికి చెందిన చీమల బయన్న కుమారుడు తరుణ్ కనిపించడం లేదు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని శ్రీసత్య సాయి కళాశాల హాస్టల్‌లో ఉంటూ అక్కడే ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో ఎవరికీ చెప్పకుండా ఈ నెల 20న మధ్యాహ్నం స్వగ్రామానికి చేరుకోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు.... అదే రోజు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులు గాలిస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 01893, 92811 07077కు సమాచారం అందించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

ధర్మవరం రూరల్: మండలంలోని కామిరెడ్డిపల్లికి చెందిన లక్ష్మీదేవి (45) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు భర్త కృష్ణయ్య, ఓ కుమారుడు ఉన్నారు. సోమవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. కాగా, ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.